# దర్గామిట్ట కతలు

# నేను నేలలో... మా అమ్మ బెంచీలో

సాయంత్రం ఆరు గెంటలకు ముందే గబగబా వేణ్ణీళ్లు పెట్టుకువేసేసి బిరబిరా స్నానం చేసేసిందంటే మా అమ్మ తొలాట సినిమాకి సైగ్గా ప్లానేసినట్టే లెఖ్ఖ!

అయిదు నిమిషాలకొక తడవ మా యిల్లుగ ల్లామైన జైబూన్‌ఆపాతో గుసగుసగా మాట్లాడతా ఉందంటే యిాళ్లిద్దరూ కలిసి మాక్కోపోబోతు న్నారని అర్దం.

అయితే- యివ్వుడు- యిాళ్లిద్దరితో కలిసి- మనం సినిమాకి పోవడం ఎలా?- అనేది నా ప్రాబ్లము.

మాఅమ్మా, జైబూన్‌ఆపాలకు కూడా- యివ్వుడు- యిా నా కొడుకుని తప్పించుకొని పోవడం ఎలా అనేది సమస్య.

ఎందుకంటే ఎవ్వుడు యిాళ్లిద్దరూ కలిసి సినిమాకి పోవాలన్నా నేనే అడ్డంకి వుల్ల.

తొలాట టయానికి మా అన్న యింట్లో ఉండదు కాబట్టి యిాళ్లకు వాడు తగులుకుంటా డనే బాదలేదు. మా చెల్లెలు, మా తమ్ముడు చిన్న పిలకాయలు కాబట్టి వాళ్లను కాపేసేదానికి మా వాయినమ్మ ఎట్టా ఉండనే ఉంది. యింక మా వాయినమ్మంటరా? సచ్చి గీపెట్టినా సరే సినిమాల తట్టు కన్నెత్తి కూడా చూడదు. అదేందో గాని అయంటే ఆమెకి బలే ఒళ్లుమంట, అసయ్యం. (అప్పటికీ ఒకసారి మా వాయినమ్మను బలవంతం చేసి 'మేరే మెహెబూబ్' హిందీ సినిమాకి పిల చకపోయినాడంట మా నాయిన. హాల్లో కూచున్నాక, సినిమా మొదలుబెట్టిన కాణ్ణుంచి 'యిాడెవడో మీసాలు లేని ముండ నా కొడుకు (హీరో రాజేంద్రకుమార్) సినిమాకి పిలచకొచ్చినా వేమిరారే' అని మానాయిన్ను తిట్టి బోసిందంట మా వాయినమ్మ).

కాబట్టి మిగిలేది నేను- పెద్దోళ్లల్లో చిన్నోణ్ణి, చిన్నోళ్లలో పెద్దోణ్ణి.

టైము ఆరయ్యింది.

ఏందో మామూలు పనున్నట్టుగా న్యాగ్గ యింట్లోకి వచ్చింది మా అమ్మ. చూస్తా ఉండగానే ట్రంకుపెట్టె కాడికెళ్లింది. పెట్టె తెరిచి, గుడ్డలన్నీ పైకి తీసి కిందున్న తెల్ల దుప్పటిని సర్రన బయిటికి లాగింది. చాలు.

అదే కొండగుర్తు- సినిమా ప్రోగ్రాము ఖరార య్యిందని చెప్పడానికి.

ఎందుకంటే మా అమ్మ తెల్ల దుప్పటి చుట్టు కొని గోషా పాటించేది సినిమాలకి పోయేటప్పుడు మాత్రమే- అది కూడా మా వాయినమ్మకు బయపడి.

నేను పుట్టి బుద్దెరిగినప్పట్నించి మా అమ్మకు బురఖాలేదు. యింకొకరి బురఖా తొడుక్కోవడం కూడా నా కళ్లతో నేను చూళ్లేదు. అసలకి మా అమ్మ గోషా, పరదా లాంటి ఎచ్చల కారీ ఖాందానీ మాటల్నే మాట్లాడేది కాదు. మా అమమ్మోళ్లిం టికి వెళ్లాలన్నా, కోంటిశెట్టి కాడికెళ్లి వొస్తువులు తేవాలన్నా ఎట్టుండేదో అట్టే బయలుదేరేది - కుచ్చిళ్లయినా దోపుకోకుండా. అయితే సినిమాకెళ్లే టప్పడు మాత్రం తలనుంచి పాదాల దాక తెల్ల దుప్పటి చుట్టుకోవడం మా అమ్మకు తప్పని సరి.

'సత్తెనాశినం రోజులొచ్చిపడి కదా ఒక సిగ్గూ ఒక శరమూ లాకుండా ఈ గుంపు యిట్టా తయా రవతా ఉండేదా? మా రోజుల్లో గోషా లేకుండా ఏటికెవ వేలన్నా బయిటికి పెట్టేవాళ్లమా' అని వస పెట్టేసేది మా వాయినమ్మ - మా అమ్మ గోషా పాటించకపోతే.

ఆమె యిట్టాంటి మాటలు మాట్లాడినప్పుడల్లా మా వాయినమ్మకు సరయిన మొగుడు జైబూన్ ఆపే. మా అమ్మన్నా నయం. మరేద కోసమైనా దుప్పటి చుట్టుకునేది. జైబూన్ ఆపా అదీ కూడాలా.

'మీ రోజుల్లో అంత గోషా ఏం పెట్టేవాళ్లు తల్లా?' అనేదామె, కొంచిం వేళాకోళంగా.

'నీకేం తెలుసుమే జైబునా? నిన్న మొన్నటి పిల్ల కాకివి. మా రోజుల్లో మొగుడికి పొగులు వూట ఎదురుపడి మాట్లాడినా యిడిచిన లంజితో సమానం తెలుసునా? పరాయి మొగోడు మమ్మల్ని చూసే మాట దేవుడెరుగు...మేము ఒక్క పరాయి మొగోణ్ణన్నా చూసెరిగే వాళ్లమా? ఆఖరికి దర్జీలకు కొలత రైక పంపడానికి కూడా సిగ్గుపడి చచ్చి మా రైకలు మేమే కుట్టుకునే వాళ్లం' అనేది మా వాయినమ్మ.


ఆమెని కదిలిస్తే కుర్ర పిల్లప్పటి కతలన్నీ యిట్టాగే చెప్పద్దని మా అమ్మ కదిలించదు. ఎప్పటిలాగే గమ్మున దుప్పటి చుట్టుకొని రెడీ అయిపోయింది సినిమాకి.

జైబూన్ ఆపా వచ్చినాక, 'రే...రిష్కా తేబో గబాల్న' అంది నా తట్టు చూస్తా.

యిది మన చాన్సుగదా.

'తేనుగా' అన్నాను తల అడ్డంగా ఊపతా.

'ఏందిరో చెస్తా ఉంటే పో...రిష్కా పిలచక రాబో' అంది జైబూన్ ఆపా.




'తెస్తే-, నన్ను గూడా - పిలచకపోవాలి- సినిమాకి' అన్నాను దీర్గాలు పెట్టి సాగదీస్తా.

'సినీమాకా? ఖాజాపీరు కోడలికి కాన్పయ్యింది నాయినా. చూసి రావడానికి పోతున్నాం. ఆడకి పిలకాయలు రాకూడదు' అంది మా అమ్మ. (చూసినారా ఎంత పెద్ద అబద్దమో- నా బోటి కిలాడీ నా కొడుకులతో)

'నువు- యాడికి- పోతున్నావో- నాకు తెలు సులేమ్మో' అని చిటికేసి, 'మరేదగా నన్ను సినిమాకి పిలచకపోకపోతే రిక్షా తేను' అని బెదిరించేశాను. దెబ్బకు మా అమ్మ దారికొచ్చేసింది.

'ఈ ఇబ్లీష్ నా బట్టతో ఎట్టా సచ్చేదమ్మా. నా దెగ్గిర ఉండేది నాలుగు రూపాయలు. రెండు టికెట్టుకి. రెండు రిష్కాకి' అంది.

'పోనీలే సర్తాజా. నేలకి పంపిద్దాం. డబ్బులు నేనిస్తాలే' అంది జైబూన్ ఆపా- అదేందో ప్రతీసారి

నన్ను బెంచీకి పంపిస్తున్నట్టు.

'సరేపా వా బట్ట. ఇంటర్‌బెల్లో వులిబంగరాలు అడిగినావో అవ్వడు జెప్తా నీ పని' అని పళ్లు పటపటమని కొరికింది మా అమ్మ.

ఆమె ఆ మాట అన్నదే తడవు చెకన్లలో రిక్షా ప్రత్యక్షమయ్యింది.

మా అమ్మ యింకో దుప్పటి తీసి రిక్షా ఆయనకిచ్చి, 'య్యోవ్! టాపేసి దుప్పటి కట్టు' అంది. (మా ఊర్లో ఉండేది బెజవాడ తట్టుండే పెద్ద రిక్షాలు. మా ఆడోళ్లు రిక్షా ప్రయాణం చేయాలంటే తప్పనిసరిగా టాపేసి దుప్పటి కట్టాల్సిందే.)

రిక్షా ఆయన దుప్పటి కట్టినాక సీట్లో మా అమ్మా జైబూన్ ఆపా, తొట్లో నేమూ కూచున్నాం. ఆట బిగిను పెట్టే టయానికి మా రిక్షా హాలు ముందర ఆగింది.

'రే...గబాల్న పోయి నేల తికెట్టు తీసుకొని కూచోబో' అని ముక్కాలు రూపాయి నా చేతిలో పెట్టింది మా అమ్మ.

నేను పరిగెడతా ఉంటే 'ఇంటర్‌బెల్లో వచ్చేసెయ్ రే' అని కేక బెట్టింది.

ఆ మాట నాకూ మా అమ్మకూ తప్ప యింకొకరికి అర్దం కాదు. అది మా యిద్దరి మద్య అండర్‌స్టాండింగు. మేము ఎప్పుడు సినిమాకి వచ్చినా ( మా అన్నను పిలచక వచ్చినా) పిలకాయలు నేలకి. పెద్దోళ్లు బెంచీకి.

సినిమా బిగినుపెట్టి, గేటు కాదుంటే మనుషులు పక్కకు పొయ్యేంత వరకే ఈ నేలా బెంచీ ఆట. అప్పటికి హాలు నిండిందా సరేసరి. లాకుంటే మరు నిమిషంలోనే మేము నేలలో నుంచి బెంచీలోకి దూకి మా అమ్మ పక్కన చేరిపోతాం- దర్జాగా.

ఆ రోజు కూడా గేట్ల కాదుండే మనుషులు లైట్లావు చేసి ఎళ్లిపోయినాక, యింటర్‌బెల్లుకు ముందే సైగ్గా లేచి బెంచీలోకి దూకినా.

అంతా చీకటి.

ఆడోళ్ల పక్కంతా కిటకిట లాడతా ఉంది. మగోళ్ల పక్క ఆడొకటి యీడొకటి ఖాళీ సీటు అవుపడతా ఉంది.

ఆటూ ఇటూ తడముకుంటా ఉంటే 'ఈడ్రో... యీడా' అంటా పిలిచింది మా అమ్మ. నా చెయ్యి పట్టుకొని పక్కనున్న సీట్లో కూచోబెట్టుకుంది.

నేను కూచున్నాక నా పక్కనున్న ఒక ఆడమనిషి నా తట్టు మా అమ్మ తట్టు ఎగాదిగా చూసింది.

'మనిషున్నాదూ.. మనిషున్నాదూ... అంట ఉన్న ఒక్క సీటులో మా ఆడబిడ్డ కూచోనీకుండా చేసినావు... నేల్లో నుంచి దూకిన ఈ బుడ్డపీసే నంటమ్మా మనిషా?' అంది తుస్కారంగా.

మా అమ్మ ఆ మాటల్ని యినిపించుకోనేలా.

నేనయితే అసలా దిక్కుకే చూల్లా!

-మహమ్మద్ ఖదీర్‌బాబు

# ఏమని వ్రాయను!

కవిత రాయాలని కలం కదిపాను
కాని, ఏమని వ్రాయను?
అన్యాయము రాజ్యమేలే
నరరూప రాక్షసుల నెదుర్కొనే
అమాయకపు ప్రజానీక మరణాల గూర్చి వ్రాయనా?
మత కల్లోలములో,
మనిషికి, మనిషికి వైరం పెరిగి
రక్త జ్వాలలు రగులుతున్నాయని వ్రాయనా?
కష్టానికి ఫలితం లభించక
కడుపు నిండని నిరుపేదల, నిర్భాగ్యుల
ఆకలి చావుల గూర్చి వ్రాయనా?
డిగ్రీ పుచ్చుకొన్న విద్యార్థి
లంచాలు పెట్టలేక
ఉద్యోగ స్వామ్యంలో
నిరుద్యోగి చావు గూర్చి వ్రాయనా!
ఏమని వ్రాయను!
ఏమి వ్రాసినా అంతా అంధకారం!
అందుకే ఆగిపోయింది నా కలం!!

-వాణి అశోక్, హైద్రాబాద్.


**షుగర్ రక్తపోటు (B.P.) వ్యాధిగ్రస్తులకు శుభవార్త!**

ప్రతిరోజా బెల్లము, పంచదార, తేనె అనుపానములతో మా మందులు వాడుతూ వ్యాధిని తగ్గించుట మా ప్రత్యేకత, వైద్య విధానంలో నూతన ప్రక్రియ, పత్యం లేదు (95%) లోగడ ఇటువంటి మూలికా వైద్యము మనకు లభించియుండలేదు.

**వాసు క్లినిక్** డాక్టరు డి. భాస్కరరావు A.G.A.C. R.M.P. A.M.T.S.

వస్తు గుణదీపిక ఆధారంగా మంచి మూలికా వైద్యము, మంచి అనుభవము కలిగి మూలికా వైద్యముతో షుగరు, బి.పి. వ్యాధిని నివారించును. ప్రతిరోజు బెల్లము, జిలేబీ, పంచదార, బెల్లముతో, పరమాన్నము తినుచు, రక్తపరీక్ష చేయించుకోవచ్చు. ఇంగ్లీషు మందులు, షుగరు టాబ్లెట్సు, ఇన్సులిన్ ఇంజక్షన్స్ వాడనవసరం లేదు, మానివేసి మా మందులు వాడుతున్నారు. మా మందులతో స్త్రీ, పురుషులకు శక్తి కలిగించును. షుగరు, బి.పి. వలన పక్షవాతము, మూత్రపిండములు చెడిపోయిననూ, మూత్రనాళములో రాళ్ళు మా మందులతో బాగు అగును. మా మందులతో రియాక్షన్స్, ఎటువంటి కాంప్లికేషన్ గాని వుండవు. వ్యాధి ఉన్న వ్యక్తి స్వయముగా వచ్చి డాక్టరుగారిని సంప్రదించవలెను.

మా బ్రాంచీలు : అన్ని బ్రాంచీలలో డాక్టరుగారిని సంప్రదించు వేళలు ఉ. గం. 8-00 నుండి సా. గం. 7-00ల వరకు
ప్రతి సోమవారం : గుంటూరు బస్టాండ్ ఎదురుగా. హోటల్ సరోవర్, ఫోన్ : 221744, 220678, 222065
ప్రతి గురువారం : విజయవాడ - 2, మేనక లాడ్జి, బీసెంట్ రోడ్, పాత (L.I.C.) బిల్డింగ్ ప్రక్కన, ఫోన్ : 574117
ప్రతి శుక్రవారం : కాకినాడ, కల్పన థియేటర్ ఎదురుగా, ఉడిపి వీనస్ లాడ్జి, ఫోన్ : 75811, 63266
ప్రతి శనివారం : తాడేపల్లి గూడెం కన్యకా పరమేశ్వరీ సత్రము ప్రక్కన, న్యూ రామా గెస్ట్‌హౌస్‌లో (ఏలూరు రోడ్డు), ఫోన్ : 23361
ప్రతి ఆదివారం : జుజ్జూరు (ఇంటి వద్ద) పచ్చకామెర్లకు ఉచితంగా మందులు యివ్వబడును.
హెడ్ ఆఫీసు : జుజ్జూరు (కృష్ణాజిల్లా) వీరులపాడు మండలం 521181 (వయా కంచికచర్ల)

గమనిక : ఒకసారి డాక్టరుగారి పరీక్ష అయిన తర్వాత పోస్టు ద్వారా కూడా మందులు పంపబడును.